

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





మంగళవారం, జూలై 7, 2026 | పేజీలు : 5


### రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా

# పంపిణీ చేయాలి

**-ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి**

**-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్ : జులై 06 (ప్రజా జ్యోతి)** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా ఎరువులను సకాలంలో,పారదర్శకంగా,సమర్థవంతంగా పంపిణీ చేయాలని,వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి బదులుగా తక్కువనీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, లాభదాయకమైన కూరగాయల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వ్యవసాయ అధికారులకు సూచించారు.సోమవారం బిజినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆకస్మికంగా సందర్శించారు.రైతులకు యూరియా పంపిణీ తీరును పరిశీలించి,రైతులతో మాట్లాడి ఎరువుల లభ్యత,పంపిణీ విధానం, ఎదురవుతున్న సమస్యల గురించి అరా తీశారు. రైతులు ఇబ్బందులు పడకుండా ఎరువులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, సహకార శాఖ అధికారులతో కలెక్టర్ మండలంలో ప్రస్తుతం ఉన్న యూరియా నిల్వలు, రైతుల డిమాండ్, పంపిణీ ప్రక్రియ,పంటల సాగు విస్తీర్ణం, వర్షపాతం పరిస్థితులు తదితర అంశాలపై సమగ్రంగా

# ప్రజావాణికి పోటెత్తిన వినతులు

- 132 ఫిర్యాదుల స్వీకరణ
- ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు
- అధికారులకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశం



### ఈనెల 24లోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్

# పూర్తి చేయాలి

**-పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పారదర్శకంగా చేపట్టాలి.**

**- కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు.**

**-జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశాలు.**

**నారాయణపేట ప్రతినిధి జూలై 06 (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సర్వే (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, ముఖ్యంగా ఫారాల డిజిటలైజేషన్‌ను ఈ నెల 24వ తేదీలోగా శాతం వందకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి పోలింగ్ కేంద్రంలో సుమారు 1000 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశంలో



### ప్రజావాణి వినతులను చట్టప్రకారం

# పరిష్కరించాలి

**-జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**



**నాగర్ కర్నూల్ : జులై 06 (ప్రజా జ్యోతి)** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు దారుల నుండి 12 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్‌స్వీకరించారు.ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు.నేటి ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 12 అర్జీలలు రాగా అందులో 05వినతులు భూమికి సంబంధించిన కాగా,తగు న్యాయం కోసం

# ఈనెల 24లోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

ఆయన ఎస్ఐఆర్ పురోగతి, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఫారాల డిజిటలైజేషన్, రాజకీయ పార్టీలతో నిర్వహించాల్సిన సంప్రదింపులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమైనదని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు.
పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని, కొత్తగా రూపొందించే పోలింగ్ కేంద్రాల ముసాయిదాపై ఈ నెల 25వ తేదీ నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు స్వీకరించాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి పాల్గొన్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ఈ నెల 7 వరకు పూర్తి అవుతుందని తెలిపారు.
జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.
బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలు అందజేస్తూనే, తిరిగి నింపిన ఫారాలను స్వీకరించి వాటిలోని వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.
ఫారాల స్వీకరణతో పాటు వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా వేగవంతం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా




ఈ నెల 24వ తేదీ నాటికి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.
ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య సమతుల్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ నెల 25వ తేదీ నుంచి అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల ముసాయిదాను సిద్ధం చేస్తామని వెల్లడించారు
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీఓ రమేశ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జయ సుధ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవో సుదర్శన్‌కు బీజేపీ నాయకుల శుభాకాంక్షలు



**వడ్డేపల్లి జూలై 06(ప్రజా జ్యోతి):**
వడ్డేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) ఇటీవల బాధ్యతలు చేపట్టిన సుదర్శన్‌ను సోమవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదర్శన్‌కు శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అలంపూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్ మాట్లాడుతూ,సుదర్శన్ తన అనుభవం,చిత్తశుద్ధితో వడ్డేపల్లి మండలంలో అభివృద్ధి,సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు చేరవేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు,ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలం సర్వతోముఖ అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు బోయ నాగరాజు,జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మాజీ మండల అధ్యక్షుడు నరసింహాతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను చట్టప్రకారం పరిష్కరించాలి

06,భార్యాభర్తల పంచాయతీకి 01 స్వీకరించి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు సూచనలు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా,పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా,శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

## ప్రజావాణికి పోటెత్తిన వినతులు

మహబూబ్‌నగర్, జూలై 6 ( ప్రజా జ్యోతి బ్యూరో )
ప్రజావాణి కార్యక్రమంలో అర్జిదారుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ఆమె ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను ఓర్పుగా విన్న కలెక్టర్, ప్రతి ఫిర్యాదును పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాలు, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి, ప్రణాళిక, విద్యుత్, విద్య, వైద్య ఆరోగ్యం,అటవీ, గ్రామీణ అభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 132 వినతులను అధికారులు స్వీకరించారు.

### రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు పెంచాలి

ప్రజావాణి అనంతరం నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో లైఫ్ మెంబర్‌గా తప్పనిసరిగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రూ. 1,000 చెల్లించి లైఫ్ మెంబర్‌గా నమోదు కావచ్చని తెలిపారు.
సభ్యత్వ నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో సమర్పిస్తే సభ్యత్వ నమోదు పూర్తవుతుందని, మూడు రోజుల్లో డిజిటల్ సభ్యత్వ గుర్తింపు కార్డు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని పెంచడం ద్వారా రక్త బ్యాంకుల నిర్వహణ, పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం వంటి మానవతా సేవలను మరింత విస్తరించడం లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, డీఆర్వో ఎ. నిర్మల, జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్డీఓ నరసింహులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయాలి

ఆరా తీశారు.రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని,నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. అనంతరంవ్యవసాయశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ బిజినపల్లి మండలంలో మొత్తం 244 టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని,మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 62 టన్నుల యూరియా నిల్వ ఉందని,ఆన్‌లైన్‌లో నమోదు చేసు కున్నరైతులకు అవసరాలకనుగుణంగా బయోమెట్రిక్ ద్వారా పంపిణీ జరుగుతుందని,కొరత లేకుండా ఎరువు నిల్వలు అందుబాటులోకి తెస్తున్నామనిఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 12,345 ఎకరాల్లో పత్తి పంటల సాగు జరిగిందని, ఇప్పటివరకు 31 ఎకరాల్లో వరి,45 ఎకరాల్లో మొక్క,79 ఎకరాల్లో వివిధ పంటలుసాగు ప్రారంభమైందని రానున్న రోజుల్లో వర్షాలు కురిసిన వెంటనే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని యూరియా పంపిణీలో అవకతవకలకు తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని,రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించాలని యూరియా బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా పటిష్ట చర్యలు తీసుకోని అర్హులైన వారికే యూరియా అందేలా చూడాలన్నారు. ఈ ఏడాది వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవాలని వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో అధిక దిగుబడిఇచ్చే జొన్న,చిరుధాన్యాలు,పప్పుధాన్యాలు,నూనెగింజల పంటలను సాగుచేయడం ద్వారా వ్యయాన్ని తగ్గించుకోవచ్చని, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న లాభదాయకకూరగాయల పంటల సాగుపై అవగాహన కల్పించిరైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారుల సలహాలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని,పంటల ప్రణాళిక, ఎరువుల వినియోగం,నీటి యాజమాన్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు సహకరించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట తాహసిల్దార్ మునీరుద్దీన్,నాగర్ కర్నూల్ డివిజన్ శాఖ అధికారి పూర్ణచంద్ర్ రావు, తదితరులు ఉన్నారు.

# తరచూ మూతపడుతున్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం

## శాంతినగర్ ప్రజల ఆగ్రహం

**వడ్డేపల్లి జూలై 06(ప్రజా జ్యోతి):**
వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్ ప్రాంత ప్రజలకు అత్యవసర ఆర్థిక లావాదేవీలకు ఉపయోగపడుతున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం నిర్లక్ష్యానికి గురవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.శాంతినగర్‌లో ఉన్న ఈ ఏటీఎంలో నగదు విత్‌డ్రాతో పాటు నగదు డిపాజిట్ చేసే (సీడీఎం) సౌకర్యం కూడా ఉండటంతో వ్యాపారులు,రోజువారీ కూలీలు,ఉద్యోగులు, పింఛనుదారులు పెద్ద సంఖ్యలో దీనిని వినియోగిస్తున్నారు.అయితే గత కొన్ని వారాలుగా ఏటీఎం తరచూ మూతపడటం,సాంకేతిక లోపాల కారణంగా పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఏటీఎం పనిచేయకపోవడంతో నగదు అవసరాల కోసం వృద్ధులు,మహిళలు,ఇతర ఖాతాదారులు కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్యాంకు శాఖలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా పింఛను నగదు తీసుకునే రోజుల్లో సమస్య మరింత తీవ్రమవుతోందని తెలిపారు.ఈ నేపథ్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు వెంటనే స్పందించి శాంతినగర్ ఏటీఎంలోని సాంకేతిక




సమస్యలను పరిష్కరించడంతో పాటు నగదు డిపాజిట్ యంత్రాన్ని కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచి,24 గంటల పాటు నిరంతరాయంగా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని తక్షణమే నివారించి బ్యాంకింగ్ సేవలను మెరుగుపర్చాలని వారు కోరుతున్నారు.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి




**నారాయణపేట ప్రతినిధి జూలై 06 (ప్రజా జ్యోతి)**
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏ రోజు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది అందులో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున విద్యార్థులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీపీఓ రాజేశ్వర్ మేడంకు వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు నరహరి, జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, జిల్లా అధ్యక్షులు భానుప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

### 215 మందికి ఉచిత వైద్య పరీక్షలు.. మందుల పంపిణీ

### శిబిరాన్ని సందర్శించిన ఎస్సై రామన్ గౌడ్



**చిన్నంబావి, జూలై 6 ( ప్రజా జ్యోతి)**
గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో చిన్నంబావి మండల కేంద్రంలో డా. మనీష రెడ్డి డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణురాలు డా. మనీష రెడ్డి ఆధ్వర్యంలో మొత్తం 215 మంది రోగులకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణ, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని డా॥ మనీష రెడ్డి తెలిపారు. శిబిరంలో మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ), గుండె విద్యుత్ స్పందన పరీక్ష (ఈసీజీ), ఊపిరితిత్తుల పనితీరు (పీ.ఎఫ్.టీ.) పరీక్షలు పూర్తిగా ఉచితంగా నిర్వహించారు.అంతేకాకుండా శ్వాసకోశ వ్యాధులకు సంబంధించిన ప్రత్యేక పరీక్షలు చేసి, బాధితులకు తగిన వైద్య సూచనలు అందించారు.ఉబ్బసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, దీర్ఘకాలిక



దగ్గు, బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు, క్షయవ్యాధి తదితర సమస్యలతో బాధపడుతున్న రోగులను ప్రత్యేకంగా పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా చికిత్స అందించారు.అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరాన్ని చిన్నంబావి ఎస్సై రామన్ గౌడ్ సందర్శించి వైద్య సేవల తీరును పరిశీలించారు. అనంతరం ఆయన స్వయంగా రక్తపోటు పరీక్ష చేయించుకుని వైద్య బృందాన్ని అభినందనలు తెలిపారు. గ్రామీణ పేద ప్రజలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందించడం అభినందనీయమని, ఇలాంటి శిబిరాలు గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని నిర్వహించాలని ఆయన సూచించారు.శిబిరంలో వైద్యులు, సిబ్బంది ప్రతి రోగిని క్షుణ్ణంగా పరీక్షించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.సమయానికి పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స పొందే అవకాశం ఉంటుందని వైద్యులు సూచించారు.
మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నందుకు నిర్వాహకులు సంతోషం వ్యక్తం.చేశారు.భవిష్యత్తులో కూడా ప్రజలకు మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డా॥ మనీష రెడ్డి ఎంబీబీఎస్ ఎండి డా॥ యశ్వంత్,షేక్ అబ్దుల్లా,ఇక్బాల్, మోహన్, నందిని,దుర్గ,లక్ష్మి తదితరులు ఉన్నారు

## 15 నెలల జీతం అందించాలి



**నారాయణపేట ప్రతినిధి జూలై 06 (ప్రజా జ్యోతి)**
104 లో పనిచేస్తున్న ఫార్మాసిస్టు లు ల్యాబ్ టెక్నీషియన్ల కు గత సంవత్సరం ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు జీతాలు రాక,జీతాలు అందించాలని వారు నేడు నారాయణపేట కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ ప్రియాంక గారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం 2025 ఏప్రిల్ నెల నుండి నేటివరకు మేము ఉద్యోగం చేస్తున్న మాకు జీతాలు పడటంలేదని జీతాలు లేక కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఉద్యోగానికి రావడానికి రానుపోను రవాణ ఖర్చులు కూడా పెట్టుకోలేని పరిస్థితులలో ఉన్నామని అందుకే గత జూన్ 1వ తేదీ నుండి విధులకు కూడా హాజరు కావడం లేదని మేము ఎంతమందికి మా మొర తెలిపిన మా కష్టాలు తీరడం లేదని కావున జిల్లా కలెక్టర్ గారు మాపై దయఉంచి మాకు రావాల్సిన జీతాలను ఇప్పించి మా కుటుంబాలను ఆదుకోవాలని కోరామన్నారు.ఈ కార్యక్రమంలో 104 లో పనిచేస్తున్న ఫార్మాసిస్టు లు శ్రీనివాసులు,కృష్ణయ్య, ప్రకాష్ గౌడ్, సత్య కుమార్,రవి కుమార్. ల్యాబ్ టెక్నీషియన్లు రాజు,భాగ్యరేఖ,రవి కుమార్ లు పాల్గొన్నారు

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**నారాయణపేట ప్రతినిధి జూలై 06 (ప్రజా జ్యోతి)**
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 31 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డి.ఆర్.ఓ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వైద్య పరీక్షలు..



చిన్నంబావి, జులై 6 (ప్రజాజ్యోతి)
పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందని డాక్టర్ హరీష్ తెలిపారు. మండలంలోని కొప్పునూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి దంత సమస్యలు, జ్వరం, దగ్గు, జలుబు తదితర అనారోగ్యాలను గుర్తించి చికిత్స అందించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చని, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఎదుగుతారని డాక్టర్ హరీష్ సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుకలి శివరాముడు, ఉపాధ్యాయుడు జి. మధు, ఫార్మసిస్ట్ ఉమ, ఏఎన్ఎం స్వప్న పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 20 ఫిర్యాదులు:సత్వర పరిష్కారానికి ఎస్పీ ఆదేశాలు

**గద్వాల జూలై 06(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన 20 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు,స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా బాధితులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించి,సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో తక్షణమే సంప్రదించి చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.బాధితులకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.భూ వివాదాలు,ఆస్తి తగాదాలు,కుటుంబ కలహాలు తదితర అంశాల్లో చట్టపరంగా పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అందిన ఫిర్యాదుల్లో భూ వివాదాలకు సంబంధించినవి 8,గొడవలకు సంబంధించినవి



6, చీటింగ్‌కు సంబంధించినది ఒకటి,కుటుంబ వివాదానికి సంబంధించినది ఒకటి,ఇతర సమస్యలకు సంబంధించినవి 4 ఉండగా,మొత్తం 20 ఫిర్యాదులు నమోదయ్యాయి.

# ప్రజా జ్యోతి దిన పత్రిక పేరిట... అక్రమ వసూళ్లు

**- యాజమాన్యం అనుమతి లేకుండా ఫ్రీ లాన్స్ జర్నలిస్టుగా అప్లై**
**- యాజమాన్యం పైనే... అబండాలు**
**- కారంగి గోవిందు... ప్రజా జ్యోతి దినపత్రిక నుంచి తొలగింపు**
**- కారంగి గోవిందుపై కలెక్టర్ ఎస్పీకి ఫిర్యాదు**

**నాగర్ కర్నూల్ జులై 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవల్లి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన... కారంగి గోవింద్ నాలుగు నెలల కింద ప్రజా జ్యోతి దినపత్రికలో... చేరి యాజమాన్యానికి తెలవకుండానే ... ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ గా ప్రజా జ్యోతి కటింగ్స్ పెట్టుకోవడం జరిగింది.. ఇదిలా ఉండగా యాజమాన్యం అనుమతి లేకుండా ఫ్రీ లాన్స్ జర్నలిస్టుగా అప్లై చేసినందుకు.. కొల్లాపూర్ రిపోర్టర్గా కారంగి గోవిందు ప్రజా జ్యోతి దినపత్రిక నుంచి తొలగించడం జరిగింది. అయినా ఆయన ఇష్టానుసారంగా ప్రజా జ్యోతి దినపత్రిక పేరు చెప్పుతూ కొల్లాపూర్ నియోజక వర్గంలో వసూళ్లకు పాల్పడినందుకు సోమవారం కారంగి గోవింద్ తండ్రి ఉత్తన్నపై అతనిపై చర్యలు తీసుకోగలరని కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని ప్రజా జ్యోతి దినపత్రిక జిల్లా స్టాపర్ సయ్య షఫీ పేర్కొన్నారు. అదేవిధంగా అక్రమవసుల పాల్పడుతున్న కారంగి గోవిందుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్కు ప్రజా జ్యోతి దినపత్రిక విలేకరులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, విచారణ చేపట్టి చర్యలు చేపడతామన్నారు. కాగా కారంగి గోవిందు.. యాజమాన్యంపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నాడు... వినతి పత్రం అందజేసిన కార్యక్రమంలో ప్రజా జ్యోతి వివిధ మండలాల రిపోర్టర్లు ఉన్నారు

# దేశ సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ

## - 125వ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘన నివాళులు

**వనపర్తి, జూలై 6 (ప్రజాజ్యోతి):**
భారత ఐక్యత, సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, ప్రముఖ విద్యావేత్త డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశానికి చిరస్మరణీయుడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ అన్నారు. డా. ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం నాగవరంలోని బీజేపీ జిల్లా నూతన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డి. నారాయణ మాట్లాడుతూ, కేవలం 33 ఏళ్ల వయసులోనే కలకత్తా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టి విశిష్ట సేవలందించిన డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ, అనంతరం కేంద్ర మంత్రిగా కూడా కీలక పాత్ర పోషించారని తెలిపారు. నెహ్రూ–లియాఖత్ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేసిన ఆయన, 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించి జాతీయవాద రాజకీయాలకు బాటలు వేశారని పేర్కొన్నారు. జమ్మూ–కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370, 35ఏ నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకించిన డా. ముఖర్జీ, "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదు" అనే నినాదంతో ఉద్యమించారని గుర్తు చేశారు.



అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2019లో ఆర్టికల్ 370 రద్దుతో డా. ముఖర్జీ ఆశయం నెరవేరిందని పేర్కొన్నారు. ఆయన దేశభక్తి, త్యాగస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, వారణాసి కల్పన, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి, కార్యదర్శి కాటమోని కృష్ణగౌడ్, సీనియర్ నాయకులు బచ్చు రాము, బోయల రాము, అశ్విని రాధ, కౌన్సిలర్ విజయసాగర్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నలబోతుల అరవింద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, మాజీ కౌన్సిలర్లు గోపాల్ యాదవ్, కంచ రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూలై 06:**
విద్యుత్ షాక్ తో యువకుడు మృతి చెందిన సంఘటన ఇటిక్యాల మండల పరిధిలోని షాబాద్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.
ఇటిక్యాల ఎస్ఐ.రవి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి షాబాద్ గ్రామానికి చెందిన యువకుడు అర్పన్ తమ వ్యవసాయ పంట పొలంలో సుమారు 8.30 సమయంలో ఎదులతో గుంటిక పాస్తుండగా విద్యుత్ స్తంభంకి మరియు కరెంటు మోటారుకు ఉన్న విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే కుప్ప కూలి పడిపోనట్లు తెలిపారు.గమనించిన స్థానికులు,కుటుంబ సభ్యుల సహాయంతో చికిత్స నిమిత్తం గద్వాల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా యువకుడు అప్పటికే మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్లు నిర్ధారించిన్నట్లు తెలిపారు.మృతుడి తండ్రి కూసునూరు రాజు ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.



# నర్వలో ఘనంగా కౌడి పీర్ల ఉత్సవాలు



**నర్వ జులై 6 ప్రజా జ్యోతి**
నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున కౌడి పీర్ల ఉత్సవాలు పగలు సవారిగా ఊరేగింపు జరిగాయి , ఈ సందర్భంగా గ్రామస్తులు కౌడి పీర్లకు రాత్రి సవారీగా గ్రామ పురవీధుల గుండా సవారి చేశారు ఈ సందర్భంగా గ్రామ మహిళలు నీళ్ల భిందెలతో నీళ్లు పరబోస్తూ స్వాగతించారు,, ఈ సవారీ కార్యక్రమంలో పీర్ల నిర్వాహకులు గ్రామస్తులు పాల్గొన్నారు

# ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజన వంట సిబ్బంది ఇష్టారాజ్యం...

**మెనూ పాటించకుండా విద్యార్థుల ఆరోగ్యంతో వంట సిబ్బంది చెలగాటం...**
**వంట సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఫిర్యాదు...**

**కల్వకుర్తి జులై 6 (ప్రజా జ్యోతి):**
కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఆరోపించారు.. సోమవారం కల్వకుర్తి మున్సిపాలిటీ 18వ వార్డులోని ప్రాథమిక పాఠశాలను మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,స్థానిక వార్డు కౌన్సిలర్ నాజియా మక్బూల్ లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసే సిబ్బంది విధుల పట్ల తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కల్వకుర్తి మండల విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్ ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వంట చేయకుండా మధ్యాహ్న భోజన వంట సిబ్బంది తమ ఇష్టం వచ్చినట్లుగా ఆహారం తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన వంట సిబ్బంది ఇష్టారాజ్యం వల్ల నిరుపేద విద్యార్థులకు సరైన భోజనం అందక ఆకలితో ఇబ్బంది పడుతున్నారని నాణ్యత లేని ఆహారం వల్ల వారి ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో, ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న మధ్యాహ్న భోజన వంట సిబ్బందిపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోని మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

కల్వకుర్తి మండల విద్యాధికారి స్పందన...

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట సిబ్బంది ఇష్టారాజ్య వ్యవహారంపై కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ చేసిన ఫిర్యాదును స్వీకరించిన మండల విద్యాధికారి శంకర్ నాయక్ స్పందిస్తూ తక్షణమే ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల భోజన విషయంలో ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్న మధ్యాహ్న భోజన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి,నాయకులు సోఫీ,దున్న సురేష్,పడకంటి వెంకటేష్,మహేష్,తదితరులు ఉన్నారు.



# ఈనెల 24 లోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

**-పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పారదర్శకంగా చేపట్టాలి**
**-కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలి**
**-కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశాలు**
**-ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం**
**-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**






**నాగర్ కర్నూల్ : జులై 06 (ప్రజా జ్యోతి)**

ఓటర్ జాబితాల ప్రత్యేక సర్వే ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని,ముఖ్యంగా ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్‌ను ఈ నెల 24వ,తేదీలోగా పూర్తిచేయాలని పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి,పోలింగ్ కేంద్రంలో సుమారు 1000 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా విధంగా ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిసూచించారు.సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష సమావేశంలో ఎస్ఐఆర్ పురోగతి,పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్,ఫారాల డిజిటలైజేషన్ పై రాజకీయ పార్టీలతో సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ జాబితాల సవరణ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థలో ఎంతో కీలకమైనదని,ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని,ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వద్దని పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని, కొత్తగా రూపొందించే పోలింగ్ కేంద్రాల ముసాయిదాపై ఈ నెల 25వ,తేదీ నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలను నిర్వహించి వారి అభిప్రాయాలను స్వీకరించి అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతిపాదనలుసిద్ధం చేయాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్
హేమంత కేశవ్ పాటీల్ జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్,అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 880 పోలింగ్ కేంద్రాల్లో 7,31,632మంది ఓటర్లు నమోదై ఉండగా,సోమవారంనాటికి 7,26,072 మందికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని,ఇంకా మిగిలిన 5,560 మందికి మంగళవారం సాయంత్రంలోగా ఫారాలు అందజేసి ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 99.24 శాతం ఫారాల పంపిణీ పూర్తయిందని,బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఫారాలు అందజేస్తూనే, తిరిగి నింపిన ఫారాలను స్వీకరించి వాటిలోని వివరాలను నమోదు చేస్తున్నారని,ఫారాలస్వీకరణ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడం జరిగిందని,ఇప్పటికి 34,293 మంది ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందని,4.69 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తఇందని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు 24వ, తేదీకి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్నికలసంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పారదర్శకంగా నిర్వహిస్తామని,ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య సమతుల్యంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని,ప్రజలకు సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని,ఈ నెల 25 నుంచి అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల ముసాయిదాను సిద్ధం చేస్తామన్నారు.ఈవీడియో కాన్ఫరెన్స్‌లో కొల్లాపూర్ ఆర్‌డీఓ బన్సీ లాల్, నాగర్‌కర్నూల్ ఆర్‌డీఓ అర్చన,ఎన్నికల సూపరింటెండెంట్ రవికుమార్,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నారాయణపేట,చేనేత సహకార సంఘాల లావాదేవీలు, వారసత్వ నిరసన



**నారాయణపేట ప్రతినిధి జూలై 06 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట, పట్టణ నగరంలోని గాంధీనగర్‌లో స్థాపించబడిన నారాయణపేట చేనేత సహకార సంఘం (1951) పై కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇది సంఘం నమోదులో 4,267 చేనేత కార్మికులు ఉన్నట్లు రికార్డు ఉందని కార్యకర్తలు పేర్కొన్నారు. అయితే చనిపోయిన కార్మికుల వారసుల సభ్యత్వాలను పలు దశాబ్దాలుగా నమోదు చేయకుండా, సంఘం లావాదేవీలలో అనేక అవివేకాలు జరిగాయన్న ఆరోపణలతో వారు ప్రతికార్యం చేపట్టారు.

కార్మికుల దారుణ పేర్కొనటంతో ఏదో 30 సంవత్సరం నుంచి అనేక వారసులు తమ సభ్యత్వ హక్కుల కోసం విన్నవనలు ఇచ్చినప్పటికీ, సంబంధిత జౌళి శాఖ, జిల్లా సహకార కార్యాలయం మరియు కమిషనర్ కార్యాలయమే నిర్ణాయకంగా స్పందించలేదని ఆరోపించారు. గడచిన దశాబ్దంలో (సుమారు 2009--2020) సహకార సంఘాల్లో సుమారు రూ.40 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయని, అదే సమయంలో కార్మికులకు ముడిసార్ల సరఫరా లేకుండా, లక్ష్యంగా ఉండాల్సిన ఉపాధి ఇవ్వకుండా అనేక అరుపులు చేసినట్టు బాధితులు అంటున్నారు.

ప్రత్యేకంగా హెచ్‌డబ్ల్యూసీఎస్ సంఘం, లక్ష్మీ సిల్క్ సొసైటీ మరియు చిన్న జట్టు సహకార సంఘంలో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిగాయి కానీ కార్మికులకు ఉద్యోగ సదుపాయాలు లేదా నిధుల పంపిణీ జరగలేదని ఆయా కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. స్థానిక అదనపు డైరెక్టర్ (ఏడీ) విజయకుమార్ పై జిల్లా సహకార కార్యాలయంతో కలిసి సిండికేట్ ?గా పనిచేస్తున్నారని, ఆ అధికారుల సహకారంతోనే అవినీతి జరిగిందని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# జునోసిస్ వ్యాధులపై అప్రమత్తతే ప్రాణరక్షణ

## – ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, జూలై 6 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జునోసిస్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా అనేక ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జునోసిస్ వ్యాధుల నియంత్రణలో ప్రజారోగ్య పరిరక్షణకు పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, స్థానిక సంస్థలు, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. జంతువుల నుంచి మనుషులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంక్రమించే వ్యాధులను జునోసిస్ వ్యాధులుగా పేర్కొంటారని, వైరస్‌లు, బ్యాక్టీరియా, పరాన్నజీవులు, శిలీంధ్రాల ద్వారా ఇవి వ్యాపిస్తాయని వివరించారు. వ్యాధిగ్రస్త జంతువులతో ప్రత్యక్ష సంబంధం, జంతువుల కాట్లు లేదా గీతలు, కలుషితమైన పాలు, మాంసం, గుడ్లు వంటి ఆహార పదార్థాల వినియోగం, జంతువుల విసర్జనలు, మూత్రం, రక్తంతో సంబంధం, అలాగే దోమలు, పేలు, ఈగలు వంటి వాహకాల ద్వారా ఈ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. రేబీస్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్, ఆంత్రాక్స్, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ వంటి వ్యాధులు ప్రధాన జునోసిస్ వ్యాధులుగా గుర్తించబడినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు తమ పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని, జంతువులను తాకిన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పాలను బాగా మరిగించి, మాంసం, గుడ్లను పూర్తిగా ఉడికించిన తర్వాత మాత్రమే వినియోగించాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న లేదా చనిపోయిన జంతువులను నేరుగా తాకకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పశువుల షెడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, ఈగలు, పేలు వంటి వాహకాల నియంత్రణ చర్యలు చేపట్టాలని, పెంపుడు జంతువుల ఆరోగ్యాన్ని పశువైద్యుల ద్వారా ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని కలెక్టర్ కోరారు. జునోసిస్ వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. శివానంద స్వామి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## చిన్నంబావిలో ఎస్సీ, ఎస్టీ కేసు దర్యాప్తు.. ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

**-ఫిర్యాదు మేరకు దర్యాప్తు.. కొప్పునూర్ ఘటన స్థలంలో డీఎస్పీ పరిశీలన**

**చిన్నంబావి, జులై 6 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండల కేంద్రంలోని కొప్పునూర్ గ్రామ శివారులో నమోదైన ఎస్సీ, ఎస్టీ,అట్రాసిటీ కేసు ఫిర్యాది మేరకు దర్యాప్తులో భాగంగా డీఎస్పీ జి. గిరిబాబు సోమవారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు తగరం వెంకటస్వామి తండ్రి చిన్న నరసింహ ఇచ్చిన ఫిర్యాదు నమోదైన కేసులో చిన్నంబావి ఎస్సై రామన్ గౌడ్‌తో కలిసి అంగడి స్వామిరెడ్డి బావి వద్దకు వెళ్లిన డీఎస్పీ, ఘటన జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సంఘటనకు సంబంధించిన పరిస్థితులు, ప్రాథమిక ఆధారాలను పరిశీలించి కేసుకు సంబంధించిన వివరాలను సేకరించారు.ఈ సందర్భంగా డీఎస్పీ జి. గిరిబాబు మాట్లాడుతూ, కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుతం ఫిర్యాదుదారుడు తగరం వెంకటస్వామి అందుబాటులో లేరని, ఆయన వాంగ్మూలం నమోదు చేసిన అనంతరం కేసులోని అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి చట్టప్రకారం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. దర్యాప్తులో వాస్తవాలను నిర్ధారించిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

